క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న దేవస్థానం ఉద్యోగి రాము

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని హెచ్‌బీకాలనీకి చెందిన మద్దిల రామారావు, లక్ష్మి దంపతులు లక్షా 1116 రూపాయిల విరాళం ఇచ్చారు. సింహగిరిపై ఉన్న మే ఐ హెల్ప్ యు కేంద్రంలో నగదు రూపంలో దేవస్థానం ఉద్యోగి రాముకి అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు బాండ్ అందజేసి స్వామివారి దర్శనం కల్పించారు.

గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ నిషేధించాలి

మద్దిలపాలెం : గిరి ప్రదక్షిణలో ప్లాస్టిక్ వినియోగం లేకుండా చర్యలు తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఏపీ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్. కె.ఎస్.ఆర్. మూర్తి విజ్ఞప్తి చేశారు. గిరి ప్రదక్షిణలో వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు ఉచితంగా అందిస్తున్నారన్నారు. వీటి వలన పర్యావరణకు చేటు జరిగే ప్రమాదం ఉందన్నారు. వీటికి ప్రత్యామ్నాయంగా స్టీల్‌గాసులలో మంచినీరు, మజ్జిగ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం



రూ.5 వేలు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న నాగరాజు

ఎంవీపీకాలనీ: ఇంట్లో పెద్ద దిక్కును కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు ఆర్థికసాయం అందజేశారు. 17వ వార్డుకు చెందిన బొమ్మిడాల పెంటయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయనపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న ఆయన రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

ఆగస్టు 3న విద్యార్థులకు పోటీలు

టీచ్‌రోడ్డు: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలుగు తీయడానికి వికాస తరంగిణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీమాన్ ఎంఎస్ఎస్ వర్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 3వ తేదీన నాలుగు అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొనే విధాగంగా పాఠశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 99896 95888 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం



ప్రసాద్ (ఫైల్)

టీచ్‌రోడ్డు: ఆటో డ్రైవర్ అదృశ్యంపై మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం శ్రీహరిపురానికి చెందిన డి.వెంకట ప్రసాద్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలాగే ఈ నెల 16న ఉదయం 9 గంటలు ఇంటి నుంచి ఆటోలో బయలుదేరాడు. ఆ రోజు రాత్రి 10 గంటలైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భార్య గుణలక్ష్మి ఫోన్ చేసి చేసినా స్పందించలేదు. మరోసటి సీబీఎం కాంపౌండ్ దగ్గర నివాసం ఉంటున్న బంధువుల ఇంటి వద్ద ఆటో పార్క్ చేసి ఉండడాన్ని గమనించారు. అందులోనే మొబైల్ కూడా ఉంది. రెండు రోజులుగా ప్రసాద్ జాడ కోసం విచారించినా ఎటువంటి వివరాలు తెలియకపోవటంతో మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీరు పుష్కలం



పదో వార్డులో ఏర్పాటు చేస్తున్న బోరు (ఫైల్)

ఆరిలోవ : తూర్పు నియోజకవర్గంలో జీవీఎంసీ జోన్-2 పరిధిలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు నిరంతరం చర్యలు చేపడుతున్నారు. నియోజకవర్గంలో జోన్-2 పరిధిలో ఐదు వార్డులున్నాయి (9 నుంచి 13). ఆయా వార్డుల్లో అటు జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్, డెయిరీఫారం, రవీంద్రనగర్ నుంచి ఇటు తోటగరువు, దుర్గాబజార్, ఆరిలోవ కాలనీ విశాఖ కేంద్ర కారాగారం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్‌కాలనీ వరకు, కొండవాలు ప్రాంతాలైన హనుమంతవాక నుంచి పెదగదిలి, చినగదిలి, టీస్ దయాల్‌పురం వరకు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు నీటి సమస్య రాకుండా జీవీఎంసీ నీటి సరఫరా అధికారులు చర్యలు చేపడుతున్నారు. నిరంతర ప్రక్రియలో భాగంగా కొత్త కుళాయిలు వేయడం, అవసరమైనచోట కొత్తగా బోర్లు తీయడం చేస్తున్నారు. ఈ వార్డుల పరిధిలో వేల సంఖ్యలో కుళాయిలు, వందల సంఖ్యలో బోర్లు అందుబాటులో ఉన్నాయి. దీంతో పాటు ట్యాంకర్లు ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. దీంతో ఆయా వార్డుల్లో పుష్కలంగా నీటి సరఫరా జరుగుతోంది.


- 13,308 కుళాయిలు 706 బోర్లు..

జీవీఎంసీ తొమ్మిది నుంచి 13వార్డుల పరిధిలో 13,308 కుళాయిలు, 706 తాగునీటి బోర్ల ఉన్నాయి. వాటిలో బిలో పావర్టీ లైన్ (బీపీఎల్) వారికి 8,426 కుళాయిలు, ఎబౌ పావర్టీ లైన్ (ఏపీఎల్) గలవారికి 4,643 మంది సొంత కుళాయిలు ఉన్నాయి. అందరికీ తాగునీరు అందుబాటులో ఉండాలనే ఆలోచనతో జీవీఎంసీ నీటి సరఫరా అధికారులు 239 చోట్ల వీధి కుళాయిలు కూడా ఏర్పాటు చేశారు. వాటితో పాటు 706 చోట్ల బోర్లు కూడా తీయించారు. వీటన్నింటితో పాటు రెండు ట్యాంకర్లు ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ ట్యాంకర్లు ద్వారా కొండవాలు ప్రాంతాలతో పాటు ఆరిలోవలో పలుచోట్ల, పైనాపిల్‌కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, ఎస్ఎస్ఎన్ నగర్ తదితర ప్రాంతాలకు నిరంతరం నీటి సరఫరా చేస్తున్నారు.

- వార్డులు వారిగా కుళాయిలు, బోర్లు..
- 9వ వార్డులో 2,245 కుళాయిలు, 69 బోర్లు ఉన్నాయి
- 10వ వార్డులో 2,286 కుళాయిలు, 89 బోర్లు ఉన్నాయి



తాగునీటి బోరు



కుళాయిల ద్వారా నీటి సరఫరా

- 11వ వార్డులో 2,855 కుళాయిలు, 192 బోర్లు ఉన్నాయి.
- 12వ వార్డులో 2,853 కుళాయిలు, 202 బోర్లు ఉన్నాయి.
- 13వ వార్డులో 3,069 కుళాయిలు, 154 బోర్లు ఉన్నాయి.

తాగు నీటి సమస్య లేకుండా చర్యలు

తూర్పు నియోజకవర్గం జోన్-2 పరిధిలో ఉన్న ఐదు వార్డులకు తాగునీటి సమస్య లేకుండా నిరంతరం చర్యలు చేపడుతున్నాం. వడకట్టిన నీటిని కుళాయిలు ద్వారా సరఫరా చేస్తున్నాం. బీపీఎల్, ఏపీఎల్ వారికి వేర్వేరుగా రుసుంతో కుళాయిలు వేశాం. అవసరమైనచోట్ల పబ్లిక్ కుళాయిలు, బోర్లు ఏర్పాటు చేశారు. వాటి ద్వారా ఈ ప్రాంతంలో నీటి సరఫరా సమృద్ధిగా జరుగుతోంది. వార్డు కార్పొరేటర్ల సూచనలతో అవరమైనచోట్ల బోర్లు, పబ్లిక్ కుళాయిలు ఏర్పాటు చేస్తున్నాం.

-అప్పాజీ,
ముడసర్లోవ నీటి సరఫరా విభాగం ఏఈ, జీవీఎం

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరిగింది



పుస్తకాలు పంపిణీ చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

- మేయర్ హరివెంకట కుమారి

ఏయూక్యాంపస్ : ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం పెరిగిందని, ప్రవేశాల సంఖ్య పెరగడమే దీనికి నిదర్శనమని మేయర్ జి.హరి వెంకట కుమారి అన్నారు. శనివారం డాక్టర్స్‌కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాచకొండ చారిటీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసిన విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. చిన్నారుల కోసం ఎంతో దూరదృష్టితో ఆలోచిస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి పనిచేస్తున్నారన్నారు. పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం వరకు అర్హులైన వారికి ప్రభుత్వ పరంగా చదివించే బాధ్యతను ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు.

వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ సమస్యల రహితంగా ప్రభుత్వ పాఠశాలలు, విద్య రంగాన్ని ముఖ్యమంత్రి తీర్చిదిద్దారన్నారు. ప్రైవేటు పాఠశాలలకు పోటీ ఇచ్చే రీతిలో ప్రభుత్వ పాఠశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాయన్నారు. దూరదృష్టితో రాష్ట్ర ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమం విద్యను ప్రారంభించిందన్నారు. ప్రతిభావంతులైన అధ్యాపకులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఎంతో ఉన్నతంగా తీర్చిదిద్దడం చూస్తున్నామన్నారు. విద్యార్థి సమగ్ర వికాసం ప్రభుత్వ పాఠశాలలోనే సాధ్యపడుతుందని తాను విశ్వసిస్తున్నానన్నారు.

రాచకొండ చారిటీస్ నిర్వాహకులు రాచకొండ దశరథ రామయ్య మాట్లాడుతూ కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. విద్య, ఆరోగ్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తూ, విప్లవాత్మకమార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్య విధానం దేశానికే ఆదర్శకంగా నిలుస్తోందన్నారు. 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి మాట్లాడుతూ ప్రతీ చిన్నారి ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని బీకేడీ కుమారి, మువ్వల సురేష్, పోలిరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు.

మృతుడి కుటుంబానికి పంచకర్ల పరామర్శ



మృతుడు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొండా ఉమామ హేశ్వరరావు సోదరుడు వెంకట సంతోష్‌కుమార్ మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అతని అవయవాలు జీవన్‌ధాన్‌కు దానం చేసిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు..పార్టీ నాయకులతో కలిసి ఆరిలోవ ప్రాంతం అంబేడ్కర్‌నగర్‌లో బొండా నివాసానికి శనివారం వెళ్లి కుటుంబ సభ్యులను రామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచకర్లతో పాటు రీజినల్ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ ఎ.రాజబాబు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పి.విజయచందర్, పార్టీ నాయకులు రఘు, విక్టర్, ఈశ్వరరావు, శేఖర్, వెంకట్, రవి, కనకరాజు, నాని, మధు సంపతి, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లపై సమీక్ష

ఏయూక్యాంపస్: విద్యార్థులకు ఇంటర్న్‌షిప్స్ కల్పనపై శనివారం రాష్ట్ర ఉన్నత విద్యమండలి సమీక్ష సమావేశం నిర్వహించింది. రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, కంప్యూటర్ సెంటర్ సంచాలకులు భాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏయూ పరంగా ఇంటర్న్‌షిప్ కల్పనకు జరుగుతున్న కృషిని వివరించారు. వర్సిటీ పరంగా పూర్తిస్థాయిలో ఇంటర్న్‌షిప్స్ కల్పిస్తామని రిజిస్ట్రార్ వివరించారు.

ఏయూ మైదానంలో మొక్కలు నాటిన అధికారులు



మొక్కలు నాటుతున్న అధికారులు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శనివారం ఉదయం వర్సిటీ అధికారులు మొక్కలు నాటారు. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌లు ఇంజినీరింగ్ కళాశాలలోని ఏయూ మైదానం చుట్టూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రెండు సంవత్సరాల కంటే అధిక వయసు కలిగిన మొక్కలను ప్రత్యేకంగా తీసుకువచ్చి మైదానం చుట్టూ నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య జి.శశిభూషణ రావు, ఆచార్య టి.శోభశ్రీ, డీన్ ఆచార్య పాల్, డాక్టర్ ప్రకాష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన

మద్దిలపాలెం: అస్సాంలో జరిగిన జాతీయ సమగ్రత శిబిరానికి డాక్టర్.వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి షేక్ ఆలీ మున్ని హాజరుకావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు అన్నారు. ఈసందర్భంగా ఆవిద్యార్థిని కళాశాల అధ్యాపక బృందం సత్కరించింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారులు రత్నభారతి, ఉమామహేశ్వరరావు, సుధీర్, సామ్యూల్ డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు

- జిల్లా ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు



యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న సీడీఎంఏ కోటేశ్వరరావు, కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ: నగరంలోని యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని సీడీఎంఏ, జిల్లా ప్రత్యేక అధికారి పి.కోటేశ్వరరావు ఆదేశించారు. పదో వార్డు వివేకానందనగర్‌లో యూపీహెచ్‌సీని శనివారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావుతో కలసి ఆయన సందర్శించారు. ఇక్కడ యూపీహెచ్‌సీని పరిశీలించారు. ఏ ఏ వైద్య సేవలు అందుతున్నాయి? ఎంతమంది వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు? ఇక్కడ మందులు, పరికరాలు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు తదితర వాటి గురించి డీఎంహెచ్‌వోని అడిగి తెలుసుకొన్నారు. ఇక్కడకు వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి అందుతున్న వైద్య సేవలుపై ఆరా తీశారు. రోజూ ఓపీ ఎంత నమోదువుతోందో అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగులు ఇబ్బందిపడకుండా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. రోగుల తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్శనలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు శ్రీనివారావు, డాక్టర్ సన్యాసిరావు, జోన్-2 జెడ్సీ కనక మహలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ పాల్గొన్నారు.

అలరించిన సాహిత్య చమత్కారాలు



చమత్కార సాహిత్యాన్ని వినిపిస్తున్న ప్రవచన రాజహంస ధూళిపాక మహాదేవమణి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ప్రముఖ ప్రవచన కర్త మహాదేవమణి ఆధ్వర్యంలో సాహిత్యంలో చమత్కరాలు కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని వీఎండీఏ అధ్యక్షులు ఎం.ఎస్.ఎన్.రాజు, పైడా కృష్ణప్రసాద్, రమా గోపాల్, మల్లిక మనోజ్, మలయవాసిని ప్రారంభించారు. అనంతరం సాహిత్యంలో చమత్కారాలు రసమయ ప్రసంగాన్ని మహిదేవమణి ఆరంభించారు. ఊహకందని వస్తు విశేషం చేత కలిగే ఆనందమే చమత్కారమన్నారు. మనస్సు అబ్బురంగా వికసించడానికి చమత్కారం ఎంతో దోహదపడుతుందన్నారు.

13వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



పాండురంగాపురంలో స్థానికులతో మాట్లాడుతున్న విజయనిర్మల

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతతో కలసి పాండురాంగాపురంలో ఇంటింటికీ వెళ్లి మహిళలు, వృద్ధులు, యువకులను కలిశారు. వారికి ఇంతవరకు అందిన సంక్షేమ పథకాలను తెలుసుకున్నారు. ఎవరెవరు ఏఏ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందారో ఆరా తీశారు. ఈ సందర్భంగా వారి సమస్యలు తెలుసుకొన్నారు. కాలనీలో పందులు బెడద ఎక్కువగా ఉందని, పారిశుద్ధ్యం బాగాలేదని స్థానిక మహిళలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పారిశుద్ధ్య విభాగం అధికారులతో మాట్లాడి సమస్య వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం విజయనిర్మల మాట్లాడుతూ వార్డులో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు విస్తృత తనిఖీలు

ఎంవీపీకాలనీ: బాలకార్మికవ్యవస్థ నిర్మూలనపై జిల్లా లేబర్ డిపార్టమెంట్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నగరంలోని ఎంవీపీ కాలనీతో పాటు గాజువాక, దువ్వాడ, గోపాలపట్నం ప్రాంతాల్లో శనివారం ఈ తనిఖీలు జరిగాయి. లేబర్ డిపార్టుమెంట్ అధికారులు, జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుల ప్రత్యేక బృందం ఈ తనిఖీలను నిర్వహించింది. పలు షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న బాలబాలికలను గుర్తించి చర్యలు తీసుకున్నారు. వారిని పనుల నుంచి విముక్తులను చేయడంతో పాటు యజమానులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా పలువురు బృందం సభ్యులు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, జిల్లా వినియోగదారుల ఫోరం అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. వార్డు పరిధి గాంధీనగర్‌లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మాణానికి కాలనీ పెద్దలు, మహిళతో కలసి శనివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో రూ.22 లక్షల జీవీఎంసీ నిధులతో రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గెడ్డలు ఆధునికీకరణ చేయిస్తున్నామన్నారు. వార్డు ప్రజలకు మెరుగైన వైద్యం దగ్గరలో అందుబాటులో ఉండేవిధంగా బాలాజీనగర్‌లో యూపీహెచ్‌సీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు వివిధ కాలనీలలో సీసీ రోడ్లు, కాలువులు నిర్మించామన్నారు. బాలాజీనగర్ జీవీఎంసీ కల్యాణ మండపం ఆధునికీకరణ కోసం నిర్మాణం పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. వీటితో పాటు ఆరిలోవ ప్రాంతంలో నిర్మాణం చేపడుతున్న రైతు బజార్ త్వరలో ప్రారంభిస్తామన్నారు. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి వార్డును ఆదర్శంగా తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, జీవీఎంసీ వర్క్స్ ఏఈ అప్పాజీ, కాలనీ అధ్యక్షుడు గూడుపు అప్పారావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పూర్ణానంద స్వామిని కఠినంగా శిక్షించాలి



కృష్ణా కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం

మద్దిలపాలెం : బాలికలపై లైంగిక దాడులకు పాల్పడిన కేసులో అరెస్టు అయిన జ్ఞానానంద ఆశ్రమంలోని పూర్ణానంద స్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం డాక్టర్. వి.ఎస్.కృష్ణా కళాశాల ప్రవేశ ద్వారం వద్ద శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామిజీని శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక ముగుసులో ఆశ్రమాల పేరుతో బాబాలు, స్వామీజీలు చేస్తున్న ఆఘాయిత్యాలకు అడ్డు అదుపు లేకుండాపోయిందన్నారు. ఆశ్రమాలపై గట్టి నిఘా పెట్టాలని, అక్కడ చీకటి కోణంలో జరిగే అరాచకాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పడీఎస్‌వో కార్యదర్శి వి.లక్ష్మి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై విస్తృత అవగాహన



అవగాహన పోస్టర్ అతికిస్తున్న ఎస్ఈబీ పోలీసులు

ఎంవీపీకాలనీ: మాదక ద్రవ్యాల నిరోధానికి అంతా సమష్టిగా పనిచేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐ జగదీశ్వరరావు వెల్లడించారు. , ఈమేరకు యువతను యువతను చైతన్యవంతం చేసే దిశగా పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యాక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా శనివారం ఎంవీపీ కాలనీతో పాటు నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలలలో జరిగిన అవగాహన కార్యక్రమాల్లో ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, సూపరింటిండెంట్ బి.శ్రీనాథుడు అతిథులుగా పాల్గొని విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. తెలిసీతెలియని వయసులో మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసకావడం వల్ల శారీక సామర్థ్యం, మానసిక సామర్థ్యం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. తద్వారా ఉన్నతంగా ఎదగాల్సిన విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడుతుందన్నారు. ఈ మహమ్మారిని నిర్మూలించడంలో విద్యార్థులంతా భాగస్వాములు కావాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలపై ఎలాంటి సమాచారం ఉన్నా 14500 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. నగరంలో అనేక ప్రాంతాల్లో టోల్ ఫ్రీ నంబర్‌తో కూడిన పోస్టర్లు అతికించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

27న 'మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్'



సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎల్

ఎంవీపీకాలనీ: నరేంద్రమోదీ చేపట్టిన మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్‌త్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పిలుపునిచ్చారు. శనివారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో వివిధ మోర్చాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న పై అంశంపై పార్టీ శ్రేణులతో ప్రధాని మోదీ సంభాషించనున్నారన్నారు. ఈ కార్యక్రమం దేశ వ్యాప్తంగా 10 లక్షల పోలింగ్ బూత్‌ల పరిధిలో జరగనుందన్నారు. ఆయా పోలింగ్ బూత్‌లలో బీజేపీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారన్నారు.

నూతన విద్యావిధానంపై అవగాహన

ఎంవీపీకాలనీ: నూతన విద్యావిధానంలో చోటుచేసుకోనున్న మార్పులపై సమత కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల డిగ్రీతో పాటు పలు కోర్సుల్లో వివిధ మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జరగనున్న మార్పులపై శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించింది. ఏయూ ఆదేశాల మేరకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ ఆచార్య జి.శ్రీనివాసరావు తెలిపారు. నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ విధివిధానాలు, సింగిల్ మేజర్, సింగిల్ మైనర్ సబ్జెక్టులు, మల్టీ డిసిప్లినరీ కోర్సులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

పీఆర్ఎస్ఐ జాతీయ కార్యదర్శిగా పీఎల్‌కే మూర్తి

కొమ్మాది: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల ప్రజా సంబంధాల అధికారులు సభ్యులుగా గల భారత ప్రజా సంబంధాల సంఘం (పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా) జాతీయ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పీఎల్‌కే మూర్తి ఎన్నికయ్యారు. ఈ మేరకు న్యూ ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్‌లో శనివారం జరిగిన ఎన్నికల్లో ఆయనను ఎన్నికల అధికారి సుభాష్ సూద్ ప్రకటించారు. జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ అజిత్ పాఠక్ ఎన్నికయ్యారు. దక్షిణ భారత విభాగానికి విశాఖకు చెందిన హెచ్‌పీసీఎల్ విశ్రాంత అధికారి యూఎస్ శర్మ ఎన్నికయ్యారు. జాతీయ కార్యదర్శిగా ఎంపికైన డాక్టర్ పీఎల్‌కే మూర్తి విశాఖ పి.ఐ.ఎస్.ఐ చైర్మన్‌గా, కార్యదర్శిగా సేవలు అందించారు.